ఆంధ్రజ్యోతి ప్రవాస

## టెక్సాస్‌లో ఘనంగా స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు




**డల్లాస్:** టెక్సాస్‌లోని ఆర్వింగ్ నగరంలో 72వ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. మహాత్మగాంధీ మెమోరియల్ ప్లాజాలో గాంధీ విగ్రహం వద్ద 700 మంది భారతీయులు ఏకమై స్వాతంత్ర్యదినోత్సవాన్ని జరుపుకున్నారు. మహాత్మగాంధీ మెమోరియల్ ఆఫ్ నార్త్ టెక్సాస్(యమ్‌జీయమ్‌ఎన్‌టీ) చైర్మన్ డా.తోటకూర ప్రసాద్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. హోస్టన్ కాన్సులేట్ జనరల్ ఆఫ్ ఇండియా, వైస్ కాన్సుల్ అశోక్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వీరితో పాటు ఆర్వింగ్, సన్నివేల్ సిటీల మేయర్లు రిక్ స్టాఫర్, సజీ జార్జ్, కాపెల్ సిటీ కౌన్సిల్ మెంబర్ బిజూ మ్యాథ్యూ, ఆర్వింగ్ సిటీ పార్క్స్ అండ్ రీక్రియేషన్ మాజీ డైరెక్టర్ రే సెర్డా ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. యమ్‌జీయమ్‌ఎన్‌టీ బోర్డు సెక్రటరీ రావ్ కల్వల అతిథులందరినీ ఆప్యాయంగా స్వాగతించారు. ఈ సందర్భంగా చైర్మన్ తోటకూర ప్రసాద్ మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడానికి ఎందరో తమ ప్రాణాలను బలిచ్చారని, వారు భారతదేశానికి చేసిన త్యాగాలు మరవలేనివని వారిని గుర్తుచేసుకుని ఘననివాళులర్పించారు. ద్వేషం, జాత్యహంకారం వంటి వాటి వల్ల మనుషుల మధ్య దూరం ఏర్పడుతోందని ఆయన అన్నారు. ఓర్పు, సహనం ఉంటేనే మనుషుల మధ్య ఐకమత్యం ఏర్పడుతుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొనటం తన అదష్టంగా భావిస్తున్నానని వైస్ కాన్సుల్ అశోక్ కుమార్ తెలిపారు. ఇంత మంది భారతీయులు టెక్సాస్‌లో ఉండటం చాలా ఆనందకరంగా ఉందని, అమెరికా అభివృద్ధిలో తమ వంతు కృషి చేస్తున్న భారతీయులకు అభినందనలని ఆర్వింగ్ సిటీ మేయర్ రిక్ స్టాఫర్ అన్నారు. ఎక్స్‌ప్లోరిఫై అనే పుస్తకాన్ని కూడా ఆయన ఆవిష్కరించారు. సన్నివేల్ మేయర్ మాట్లాడుతూ ఈ వేడుకను ఇంత ఘనంగా నిర్వహించినందుకు యమ్‌జీయమ్‌ఎన్‌టీ చైర్మన్ తోటకూర ప్రసాద్‌కు, మిగిలిన సభ్యులకు తన అభినందనలను తెలియజేశారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటి వరకు భారతదేశం ఎంతగానో అభివృద్ధి చెందిందని యమ్‌జీయమ్‌ఎన్‌టీ కో-చైర్మన్ కమల్ కౌశల్ అన్నారు. చివరగా బోర్డు ట్రెజరర్ బి.ఎన్.రావు మాట్లాడుతూ కార్యక్రమానికి విచ్చేసిన అతిథులకు, భారతీయులకు, మీడియాకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం యమ్‌జీయమ్‌ఎన్‌టీ బోర్డు వారు అతిథులందరినీ సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు .కార్యక్రమంలో యమ్‌జీయమ్‌ఎన్‌టీ బోర్డు డైరెక్టర్లు జాన్ హామాండ్, పీయుష్ పటేల్, షబ్‌నమ్ మోడ్గిల్, కుంతేష్ చోక్షి, కమ్యూనిటీ లీడర్లు యమ్.వి.ఎల్. ప్రసాద్, సీ.ఆర్.రావు, అభిజిత్ రెయ్లుర్, జాక్ గోద్వానీ పాల్గొన్నారు.